

సిరిసిల్లలో పోచమ్మ అమ్మవారు



వైభవం.. ఆషాఢ బోనం

బోనం అంటే అమ్మవారి నైవేద్యం

బోనం అంటే నైవేద్యం, భోజనం, మహిళలు వండిన అన్నంతోపాటు పాలు బెల్లంతో నైవేద్యాన్ని తయారు చేస్తారు. కొత్త కుండ లేదా రాగి, ఇత్తడి పాత్రలను పసుపు కుంకుమలతో అందంగా అలంకరించి పైన చిన్న పాత్రను ఉంచి దానిపైన జ్యోతిని వెలిగిస్తారు. అలా తయారైన బోనానికి వేపాకు కూడా కడుతారు. మహిళలు కొత్త దుస్తులు ధరించి ఆ బోనాన్ని తలపైన పెట్టుకొని డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా బయలు దేరి అమ్మవారికి నీళ్లతో కూడిన సాకను సమర్పించుకుంటారు. బోనం ముందు యువకుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల శిగాలు ఉంటాయి. బోనం మొస్తున్న మహిళను దేవి అమ్మవారుగా విశ్వసిస్తారు. ఆమెను శాంతపర్చడానికి మహిళలు ఆలయం వద్ద నీళ్లు కుమ్మరిస్తారు. పూర్వ కాలంలో పండుగ రోజున దుష్టశక్తులను పారదోలడానికి బోనంతోపాటు దున్నపోతును బలిచ్చే వారు. ఇప్పుడు మేకలు, గొర్రెలు, కోడిపుంజులను బలివ్వడం ఆనవాయితీగా మారింది.

నేటి నుంచి ఆషాఢ మాసం ప్రారంభం

- గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు
- వెల్లివిరియనున్న ఆధ్యాత్మిక శోభ
- బోనాల పండుగకు సన్నద్ధం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

తెలుగు మాసాల్లో ఆషాఢానికి విశిష్టత ఉంది. ఈ మాసంలో బోనాల పండుగతో ఊరూరా ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయలకు ప్రతీకగా నిలిచే పండుగల్లో బోనాలు ఒకటి. వర్షాలు సమృద్ధిగా కురవాలని, అందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని వేడుకుంటూ గ్రామ దేవతలకు ఏటా ఈ మాసంలో పూజలు చేయడం ఆనవాయితీ. ఈ మాసంలో ప్రతీ గడప నుంచి మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, అంకాళమ్మ, పోలేరమ్మ, మారెమ్మ పేర్లతో పిలిచే అమ్మవార్లకు బోనం సమర్పించుకొని చల్లంగా దీవించమంటూ మహిళలు వేడు కుంటారు. ఆషాఢ మాసంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలే కాకుండా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతో పాటు గ్రామాల్లో బోనాల సంబరాలు జరుపుకోవడానికి ఉత్సాహం చూపు తారు. అమ్మవారికి బోనాన్ని నైవేద్యంగా సమ ర్పించు కుంటారు. శనివారం నుంచి ఆషాఢ మాసం మొదల వనుండంతో బోనమెత్తేందుకు జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నారు. ఆదివారం నుంచి బోనాల సందడి ప్రారంభంకానుంది. జూలై 7, 11, 14, 18, 25, 28, ఆగస్టు 1, 4వ తేదీల్లో అత్యధికంగా వాడవాడనా బోనమెత్తుకో నున్నారు. జిల్లాలోని గ్రామ దేవతలు, అమ్మవార్లతోపాటు వేములవాడ బద్ది పోచమ్మకు బోనాలను సమర్పిం చనున్నారు. జిల్లాలో సిరిసిల్లలో మూడు చోట్ల ఘనంగా సంబురం జరుపుకుంటే వేముల వాడలో బద్దిపోచమ్మకు, ఇల్లంతకుంటలో అంతగిరి పోచమ్మ దేవాలయాల్లో బోనాల సంబరం అంబరాన్నంటనుంది.

● గావుపట్టడం

దేవి అమ్మవారి సోదరుడైన పోతరాజును ప్రతిబింబించే ఒక మనిషి బోనాల పండుగను నడిపించడం ఆనవాయితీ. పోతరాజు పాత్రను పోషించే వ్యక్తి ఒంటిపై పసుపు, నుదిటిపై కుంకుమ, కాలికి గజ్జెలు, ఎర్రని దోవతిని ధరించి కొరడాతో బాదుకుంటూ, వేపాకులను నడుముకు చుట్టకొని అమ్మవారి సమక్షానికి బోనంతో వచ్చే మహిళలను తీసుకెళ్తాడు. అనంతరం పోతరాజు తన దంతాలతో మేకపోతును కొరికి తలా మొండం వేరు చేసే ప్రక్రియను గావు పట్టడం అంటారు. దీన్ని చూస్తే జలదరిస్తుంది.

● తానీషా కాలం నుంచి..

గోల్కొండ ప్రాంతాన్ని పాలించిన కులీ కుతుబ్‌షా పాదుషాలకే కాకుండా హైదరాబాద్ రాజ్యాన్ని పరిపాలించిన అసబ్ జాహీ నిజాం కాలంలోనూ ఆషాఢ మాసంలో బోనాల సంబరాలు జరిగేవి. కుతుబ్‌షాహీల్లో చివరి రాజు అబ్దుల్‌హసన్ తానీషా కొలువులో ఉన్న అక్కన్న మాదన్న సోదరులు గోల్కొండ కోటకు సాధారణ సైనిక రక్షణతోపాటు మానవాతీత రక్షణ అవసరమని భావించి పాదుషాను ఒప్పించి దర్బార్ హాల్ సమీపంలో అమ్మవారి మందిరాన్ని నిర్మించారు. భద్రాచలంలో రాముడి ఆలయాన్ని నిర్మించిన రామదాసును చరసాలలో బంధించి పశ్చాత్తాపంతో అబుల్‌హసన్ తానీషా అమ్మవారి ఆలయంలో పూజలు జరిపినట్లు చరిత్ర చెబుతోంది. నేటికీ ఘనంగా బోనాల పండుగలు జరుగుతూనే ఉన్నాయి. ఇలా తరతరాలుగా బోనాల సంబరాలు ఆషాఢ మాసం ముగిసే వరకు జరుపుకుంటారు.

● ఊరూరా సంబరం

ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించడంతోపాటు ఆ ప్రసాదాన్ని కుటుంబ సభ్యులు అతిథులతోపాటు భుజిస్తారు. గ్రామ శివారులలోని దేవాలయాలు, అటవీ ప్రాంతానికి వెళ్లి సంబరాలు జరుపుకుంటారు. ఈ సంబరాలను తెలంగాణలో వన భోజనాలుగా పిలుస్తారు.



కొత్త చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డీడబ్ల్యూవో లక్ష్మీరాజం

తంగళ్లపల్లి, జూలై 5: మహిళా చట్టాలు, కొత్త చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం అన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో వంద రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తంగళ్లపల్లి మండలం, నేరెళ్ల గ్రామంలో తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కళాశాల (బాలికలు)లో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు సంబంధించి చట్టాలు చాలా ఉన్నాయన్నారు. బాలికలు విద్య, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నతమైన రంగాలలో ముందుకువెళ్లాలని సూచించారు. అనంతరం లింగ సమానత్వం, ఆడపిల్లల రక్షణ, బాల్య వివాహ నిరోధక చట్టం, పని ప్రదేశంలో మహిళలపై వేధింపులను అరికట్టే చట్టాలు ఉన్నాయన్నారు. మహిళా హెల్ప్ లైన్ 181, సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబరు 1930 చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, బేటీ బచావో బేటీ పడావో వంటి వాటిపై వివరించారు. నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో టీ హబ్ కో ఆర్డినేటర్ బి.రోజా, సఖి కేంద్రంఅడ్మినిస్ట్రేటర్ ఎం.పద్మ పాల్గొన్నారు.

విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా విద్యాధికారి రమేష్



రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో రమేష్

చందుర్తి, జూలై 5 : విధులపై నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ అన్నారు. చందుర్తి మండలం కిష్టంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జడ్పీటీసీ నాగం కుమార్ సందర్శించిన సమయంలో విద్యార్థులు లేకపోవడం, ఉపాధ్యాయులు ఆలస్యంగా పాఠశాలకు హాజరు కావడంపై డీఈవో రమేష్ శుక్రవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఉన్న ఇద్దరు విద్యార్థులను సమీపంలోని జోగాపూర్ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని ఆదేశించారు. మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామంలోని యూపీఎస్‌కు ఇద్దరు ఉపాధ్యాయులను, రుద్రంగి మండలంలోని మానాల గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌కు ఇద్దరు ఉపాధ్యాయులను, ఒకరిని రుద్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కేటాయిస్తామన్నారు. ఉన్నత అధికారుల అనుమతితో ప్రధాన ఉపాధ్యాయుడిని విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న అప్ గ్రేడ్ అయిన పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపిస్తామన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని ఆదేశించారు. అనంతరం జోగాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను, చందుర్తి మండల కేంద్రంలోని కేజీబీవీని పరిశీలించారు. విద్యార్థుల స్థితిగతులను భౌతిక వనరుల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఆయన వెంట మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షితులు, మండల మానిటరింగ్ అధికారి వినయ్ కుమార్ ఉన్నారు.

రాజన్న సేవలో

అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి



కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ కల్చరల్, జూలై 5: వేములవాడ రాజరాజేశ్వరస్వామిని డివిజనల్ అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పార్వతీ పరమేశ్వరులకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం రాజన్న ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం, సూపరింటెండెంట్ తిరుపతిరావు ప్రసాదం అందజేశారు. అంతకుముందు రాజన్న ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ ప్రోటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఆలయ ఉద్యోగులు ఎడ్ల శివసాయి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అన్నదాతల అభివృద్ధే లక్ష్యం

ఎల్లారెడ్డిపేట, జూలై 5: అన్నదాతలను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చడమే సహకార సంఘం లక్ష్యమని ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట ప్యాక్స్ పరిధిలోని ఎల్లారెడ్డిపేట, నారాయణపూర్, బొప్పాపూర్ గ్రామాలకు చెందిన ఆరుగురు రైతులకు మంజూరైన రూ.27 లక్షల చెక్కులను స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాల్లో రాణించేందుకు దీర్ఘకాలిక రుణాలను అందిస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికాభివృద్ధి సాధించాలని అన్నారు. డైరెక్టర్లు వెంకటనర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంఘం కార్యదర్శి కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

పింఛన్ హామీ నిలబెట్టుకోవాలి

సిరిసిల్ల టౌన్, జూలై 5: ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం పింఛన్ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సిరిసిల్ల వృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం ఏఐఎఫ్టీయూ(న్యూ) జిల్లా కార్యాలయంలో వృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు నల్ల నారాయణ, బొల్లబత్తిని ఎల్లయ్య మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వృద్ధాప్య పింఛన్ రూ. 2వేల నుంచి రూ. 4వేలకు పెంచుతామని మేనిఫెస్టోలో పేర్కొందన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్‌పై మాట్లాడడం లేదన్నారు. ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలవగానే ఇచ్చి మాటకు కట్టుబడ్డారన్నారు. సమావేశంలో నాయకులు పోతు రాజనర్సయ్య, గర్దాస్ శ్రీనివాస్, వేముల రాజేశం, దూస రామచంద్రం పాల్గొన్నారు.

శిథిలావస్థలో సెస్ కార్యాలయం

- అధికారులు, వినియోగదారుల అవస్థలు



కోనరావుపేటలో శిథిలావస్థకు చేరుకున్న భవనం

కోనరావుపేట, జూలై 5: మండల విద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం కోనరావుపేట మండల కేంద్రంలో కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన సెస్ సేవా భవన్ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో విధులు నిర్వర్తించేందుకు అధికారులు, సెస్ కార్యాలయానికి వచ్చే వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు సెస్ కార్యాలయాన్ని 37 సంవత్సరాల క్రితం నిర్మించారు. 1986లో నిర్మించిన సెస్ కార్యాలయాన్ని అప్పటి ఎమ్మెల్యే సి.ఆనందరావు, సెస్ డైరెక్టర్ సీహెచ్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యాలయంలో మండల వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు, ట్రాన్స్‌ఫర్లు తదితర సేవలు అందించేందుకు ఏఈ లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, గ్రామాల్లో హెల్పర్‌లు ఈ కార్యాలయం ఆధీనంలో పనిచేస్తారు. ఈ కార్యాలయం గత ఐదు సంవత్సరాల క్రితమే పగుళ్లు చూపి శిథిలావస్థకు చేరుకుంది. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో అధికారులు విధులు నిర్వహించేందుకు భయపడుతున్నారు. వర్షాకాలంలో మరింత ఇబ్బంది పడుతున్నారు. పాలకులు స్పందించి నూతన భవనానికి నిధులు మంజూరు చేసి నిర్మించాలని మండల వాసులు కోరుతున్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 5: గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలను జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. జిల్లాలో 13 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రెగ్యులర్ కావడంతో కలెక్టరేట్‌లోని చాంబర్‌లో శుక్రవారం జిల్లా పంచాయతీ వీరబుచ్చయ్యతో కలిసి ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యలు రాకుండా చూడాలని సూచించారు. అంతకుముందు రెగ్యూలరైన ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ జేపీఎస్ లక్కిరెడ్డి సంపత్‌రెడ్డి, కోరుట్లపేట చిమ్మని సుస్మిత, వేములవాడ అర్బన్ మండంలోని రుద్రవరం ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన గడ్డం దిలీప్‌కుమార్, కోనరావుపేట మండలం జై సేవలాల్ తండా జక్కని సుచిత, గొల్లపల్లి గోవర్ధనం దయాకర్, తంగళ్లపల్లి మండలంలోని అంకిరెడ్డిపల్లె లావణ్య, పద్మనగర్ నీరజ, చందుర్తి మండలం మల్యాల అవారు నరేందర్, వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి కొలుపుల రమ, బోయినపల్లి మండలం కొత్తపేట గాజుల భాగ్యలక్ష్మీ, ఇల్లంతకుంట మండలం సిరికొండ గుర్రం ప్రవీణ్‌కుమార్, వీర్నపల్లి మండల కేంద్రం గాజుల పురుషోత్తం, రుద్రంగి మండలం మానాల బడుగు బాబును అభినందించారు.

జిల్లా గణాంక దర్శిని పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 5: ముఖ్య ప్రణాళిక శాఖ తయారు చేసిన (జిల్లా గణాంక దర్శని) రాజన్న సిరిసిల్ల జిల్లా హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్‌ను 2022-23 విడుదల చేశారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ప్రగతి ప్రథంలో నడిపించేందుకు గణాంకాలు ఆయువు పట్టన్నారు. ఈ సమాచారం అందరికి ఉపయుక్తముగా ఉంటుందని తెలుపుతూ గణాంక శాఖ జీడీపీ, తలసరి ఆదాయం లెక్కింపు చేసి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను ప్రపంచానికి తెలిపేందుకు తోడ్పడుతుందన్నారు. గణాంకల రూపకల్పన, డేటా ఆధారంగా పలు నిర్ణయాలు తీసుకోవడంలో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి పూర్ణ చంద్రరావు, చంద్రమౌళి, శ్యాంసుందర్, సీనియర్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల ఉపాధిపై నేడు సమావేశం

సిరిసిల్ల కలెక్టరేట్ జూలై 5: నేత కార్మికుల ఉపాధి, పరిశ్రమ కార్యాచరణపై చర్చించేందుకు సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నేతన్నలతో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం సమావేశం కానున్నారు. కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో ఉదయం 10 గంటలకు వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంతోపాటు కార్మికులకు ఉపాధి కల్పించే అంశంపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి చర్చించనున్నారు

విద్యార్థినులకు డీఈవో అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

ఎల్లారెడ్డిపేట, జూలై 5: ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు వైశాలి, మహేఖ్‌ను జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ శుక్రవారం అభినందించారు. విద్యార్థినులు పట్టుదలతో చదివి పదిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. ఉన్నత లక్ష్యంతో చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. హెచ్ఎం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు గంగరాజు, తిరుపతి, రాజు తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, జూలై 5: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురష్కరించుకొని అర్చకులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం సదస్యం నిర్వహించారు.

నిబంధనలు పాటించాలి

తంగళ్లపల్లి, జులై 5: ప్రతీ ఒక్కరు నిబంధనలు పాటించాలని, చట్టాలకు అనుగుణంగా వ్యవహరించాలని రూరల్ సీఐ మొగిలి అన్నారు. గురువారం రాత్రి తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌లో మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్యను అదుపు చేయవచ్చన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుధాకర్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో నెమలి మృతి

సిరిసిల్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జనావాసాల్లోకి వచ్చిన మయూరం విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. శుక్రవారం సాయంత్రం సిరిసిల్ల పట్టణం విమల్ థియేటర్ వద్ద తిరుగుతున్న నెమలి విద్యుత్‌షాక్‌కు గురైంది. మృతి చెందిన నెమలిని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



కాలుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- ఇబ్బందులు పడుతున్న రైతులు


మరమ్మతుల కోసం తెచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

గంగాధర, జూలై 5: వానాకాలం సీజన్ ప్రారంభంలోనే రైతులకు కరెంటు కష్టాలు తప్పడం లేదు. తరచూ విద్యుత్ టాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో నారుమడులు తయారు చేసుకుంటున్న రైతులు కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌లతో మరమ్మతు కేంద్రాలకు పరుగెత్తుతున్నారు. గంగాధర మండలంలో ప్రధానంగా వ్యవసాయం బావులు, బోర్లకింద వరి, వివిధ పంటలు సాగుచేస్తారు. మండల వ్యాప్తంగా సుమారుగా 8,500 పైచిలుకు వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. అయితే వీటికి వివిద స్థాయిలను బట్టి 16,25,63,100 కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. గత నెలలో కురిసిన వర్షాలకు గంగాధర మండల వ్యాప్తంగా 475 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. విద్యుత్ శాఖ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా 4 శాతం ట్రాన్స్‌ఫార్మర్లు నిల్వ ఉంచుతారు. కాలిపోయిన సమయంలో దానిని మరమ్మతులు జరపడం సమయం పడుతున్నందున రిజర్వులోని ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతులకు అందిస్తారు. గంగాధరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు షెడ్డు ఈ సారి తట్టుకోలేక పోతుంది. ఇటీవల లక్ష్మీదేవిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా గంగాధరలో లేకపోవడంతో రైతులు చొప్పదండి మండలం భూపాలపట్నం షెడ్డుకు 25 కిలోమీటర్ల దూరం నుంచి 10వేలు రవాణా ఖర్చులు పెట్టుకుని తెచ్చుకున్నారు.ఇప్పుడంతా లోటు కారణంగా వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వలేక పోతున్నామని విద్యుత్ అధికారులు అంటున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నెల రోజుల్లో 475..

తరచూ కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క నెలలోనే 475 కాలిపోయాయంటే రిపేర్‌లోపమా, లోవోల్టేజీ సమస్య అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రిపేర్ షెడ్డుకు వచ్చిన రెండు రోజుల్లోనే ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకం దించాల్సి ఉండగా ఈ సారి ఎక్కువగా కాలిపోవడంతో సాధ్యపడలేదని సిబ్బంది తెలుపుతున్నారు. దీనిపై కాలిదాస్,డీఈ(ఎంఆర్‌టీ)ని వివరణ కోరగా 80 శాతం లూజువైర్ల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతు న్నాయన్నారు. గాలి ఎక్కువగా వీయడం వల్ల వైర్లు ఒకదానికొకటి తాకి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయన్నారు.

● రైతులపైనే రవాణా భారం

సీజన్‌లో కురుస్తున్న వర్షాలకు కరెంటు సమస్యలు ఎక్కువయ్యాయి. పలు సమస్యలతో ప్రతిసారి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన సమయంలో రైతులపైనే భారం పడుతోంది. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆటో, ట్రాక్టర్ కిరాయికి తీసుకుని రిపేరు షెడ్డుకు పోవాల్సిందే. ప్రత్యేకంగా రిపేరు షెడ్డుకు వెల్లాల్సిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వినియోగిస్తున్న రైతులకు6 నుంచి 10 వేల ఖర్చు అవుతోంది.


నాణ్యత ప్రమాణాలను పరీక్షిస్తున్న అధికారులు

గ్రోమోర్ షాపులో చోరీ

- రూ. 38,476 అపహరించిన దుండగులు
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్

శంకరపట్నం, జూలై 5: శంకరపట్నం మండలం కేశవపట్నంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిని అనుకొని ఉండే కోరమండల్ ఇంటర్నేషనల్ మన గ్రోమోర్ ఎరువులు, పురుగుల మందుల దుకాణంలో చోరీ జరిగింది. షాపు మేనేజర్ రాయిని సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రోమోర్ షాపులో గురువారం రాత్రి షాపుకు తాళం వేసి ఎవరింటికి వారు వెళ్లిపోయారు. శుక్రవారం ఎరువుల దుకాణం వద్దకు వచ్చి చూసేసరికి షటర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. వెంటనే కేశవపట్నం పోలీసులకు సమాచారం అందించారు. కేశవపట్నం పోలీసులు క్లూస్ టీమ్‌కు సమాచారం అందించగా, వారు సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలను సేకరించారు. గురువారం ఎరువులు, పురుగుల మందులు అమ్మగా వచ్చిన రూ. 38,476 నగదు లాకర్‌లో ఉంచారు. రూ. 46,717 విలువ చేసే క్రిమిసంహారక మందులను దొంగలు దోచుకెళ్లారు. దు కాణంలో దాచిన లాకర్‌ను దుకాణం సమీపంలోని పొలాల వద్దకు ఎత్తుకెళ్లిన దుండగులు పగలగొట్టి అందులో దాచిన రూ. 38,476 నగదును దోచుకెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. కేశవపట్నం పోలీస్ స్టేషన్లో చోరీపై ఫిర్యాదు చేసినట్లు సతీష్ తెలిపారు.

బాలిక ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

చందుర్తి, జూలై 5: చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం బండపల్లి గ్రామంలో కుమ్మరి శ్రీవాణి అనే బాలికను ఇంటి నిర్మాణం విషయంలో బాబు, చిరంజీవి, రవి వ్యక్తులు వేధింపులు చేయడంతో ఈ నెల 1న ఉరి వేసుకుని బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 3న మృతి చెందింది. ఈ సంఘటనపై తల్లి లచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాబు, చిరంజీవి, రవిలపై కేసు నమోదు కాగా నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

మెట్‌పల్లి రూరల్, జూలై 5: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించిన నిల్వ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. మండలంలోని రామలచ్చక్కపేట గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుకను మెట్‌పల్లికి తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు తెలిపారు. గ్రామ శివారు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామని చెప్పారు. ట్రాక్టర్లు స్వాధీ నం చేసుకొని యజమానులపై కేసు నమోదు చేశామని వివరించారు.. అవసరమైన వారు అనుమతులు తీసుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో బాలిక ఆత్మహత్య

చందుర్తి, జూలై 5: చందుర్తి మండలం కొత్తపేట గ్రామంలో అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెందిన ఓ బాలిక శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం ఊరడి వెంకటి - పుష్ప దంపతుల కుమార్తె మహేశ్వరి(16) 15 రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. చికిత్స తీసుకున్నప్పటికీ నయం కాకపోవడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సౌండ్ పొల్యూషన్‌పై కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూలై 5: కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి ఆదేశాల మేరకు కరీంనగర్ పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించి సౌండ్ పొల్యూషన్‌కు కారణమైన వాహనాలపై కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ధ్వని కాలుష్యానికి కారణమైన జిల్లెల్లకు చెందిన మణివర్ధన్ కేటీఎం మోటార్ సైకిల్, కామెల్లి శ్రావణ్‌కు చెందిన రాయల్ యన్‌ఫీల్డ్ బైక్, బోద అంజికి చెందినా రాయల్ యన్‌ఫీల్డ్ వాహనాలు స్వాధీనం చేసుకొని కొత్త న్యాయ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్ తెలిపారు. వాహనాలకు సైలెన్సర్‌లు మార్చి ధ్వని కాలుష్యానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రమాదకరంగా మూలమలుపు


చిన్నముల్కనూర్ నుంచి పీచుపల్లికి వెళ్లే రోడ్డు మూలమలుపు

చిగురుమామిడి, జూలై 5: మండలంలోని చిన్నముల్కనూర్ నుంచి పీచుపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో గ్రామం చివరన ఉన్న ములమలుపు ప్రమాదకరంగా మారిందని రెండు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న చెట్లతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వారు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని ప్రమాదాలు జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.









ప్రభుత్వ నిర్ణయంతో ఒక్కటైన కుటుంబం

● తల్లి మృతి.. జైలులో తండ్రి ●14ఏళ్లుగా అనాథాశ్రమంలో పిల్లలు

● ఖైదీల విడుదలతో పిల్లల చెంతకు చేరిన తండ్రి



తండ్రికి పిల్లలను అప్పగిస్తున్న స్పందన నిర్వాహకుడు వీరస్వామి

జమ్మికుంట రూరల్, జూలై 5: సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం ఆ కుటుంబంలో కొత్త కాంతులను నింపింది. తల్లిదండ్రుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో తల్లి మృతి చెందింది. ఇందుకు కారకుడని తండ్రిపై కేసు నమోదు కావడంతో కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. దీనితో వారి పిల్లలు ఒంటరి వారయ్యారు. ఆలనా పాలనా చూసే వారు కరువవ్వడంతో ఇద్దరు పిల్లలు పద్నాలుగేళ్లుగా అనాథాశ్రమంలోనే పెరిగారు. ఈ నెల 3న సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను ప్రభుత్వం విడుదల చేయగా పిల్లలు జైలునుంచి వచ్చిన తండ్రి చెంతకు చేరారు. వివరాలు ఇలా ఉన్నాయి.

జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన సామ సారయ్య క్షణికావేశంలో భార్య సత్తమ్మను నెట్టగా ప్రమాదవశాత్తు మరణించింది. ఈ సంఘటన 2010సంవత్సరంలో జరిగింది. న్యాయస్థానం సారయ్యకు యావజీవ శిక్ష విధించింది. అప్పుడు వారి కుమార్తె పూజకు 5సంవత్సరాలు, కుమారుడు బన్ని 4సంవత్సరాల వయస్సు. పిల్లలను పెంచేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పోలీసుల సహకారంతో కొత్తపల్లిలోని స్పందన అనాథాశ్రమంలో చేర్పించారు. అప్పటి నుంచి వారు ఆశ్రమంలోనే ఉంటూ ఇద్దరూ చదువుకుని పెద్దవారు అయ్యారు. ప్రస్తుతం పూజ డిగ్రీ ఫైనల్ ఇయర్, బన్ని ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఈ నెల 3న సత్ప్రవర్తన కింద ప్రభుత్వం సారయ్యను విడుదల చేసింది. ఆశ్రమంలోని పిల్లల వద్దకు వచ్చిన తండ్రి పిల్లలను చూసి ఉద్వేగానికి గురయ్యాడు. వారిని దగ్గరకు తీసుకుని కన్నీటి పర్యంతం అయ్యాడు. పూజ, బన్నిలను స్పందన ఆశ్రమ నిర్వాహకులు గోపరాజు వీరస్వామి తండ్రికి అప్పగించాడు.

బెట్టింగ్ యాప్స్ నిర్వాహకుల అరెస్ట్

- రూ.33 లక్షలు, కారు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు

సుల్తానాబాద్, జూలై 5: బెట్టింగ్ యాప్‌లను నిర్వహిస్తూ యువత నుంచి లక్షల రూపాయలను కొల్లగొడుతున్న ముఠాను సుల్తానాబాద్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. వారి నుంచి 33 లక్షల పది వేల రూపాయల నగదుతో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ కుమారు తెలిపిన వివరాల ప్రకారం.. సీపీ ఆదేశాల మేరకు పెద్దపల్లి డీసీపీ, ఏసీపీ, సుల్తానాబాద్ సీఐల పర్యవేక్షణలో సుల్తానాబాద్ ఎస్‌ఐలు శ్రావణ్‌కుమార్, నరేష్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వాహనాల తనిఖీలో భాగంగా ఓ కారును తనిఖీ చేయగా రూ.33 లక్షల నగదు పట్టుబడింది. కారులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ముల్కల రాజేశ్, చిన్నపల్లి అభిలాష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళంకు చెందిన నిమ్మల ధనుంజయ్‌లు ముఠాగా ఏర్పడి 55 క్లబ్, తిరంగా యాప్, 82 లాటరీ తదితర ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ నిర్వహిస్తూ యువకుల నుంచి లక్షలాది రూపాయలు లూటీ చేస్తున్నారు. బెట్టింగ్ యాప్‌ల ద్వారా వచ్చిన డబ్బులను తీసుకుని హైదరాబాద్ నుంచి గోదావరిఖని వస్తుండగా పోలీసులకు చిక్కారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు ఆత్మహత్య

సుల్తానాబాద్, జూలై 5: సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కనుకయ్య(50) అనే రైతు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం పాల్పడ్డాడు. ఆరేళ్ల కనుకయ్య 34 గుంటల భూమిని కొనుగోలు చేయగా, లక్షల రూపాయల వరకు అప్పు అయ్యింది. రెండేళ్ల క్రితం కనుకయ్య చిన్న కుమారుడు రాజ్‌కుమార్‌కు యాక్సిడెంట్ కావడంతో చికిత్స కోసం మూడు లక్షల వరకు అప్పు అయ్యింది. మొత్తం నాలుగు లక్షల అప్పు కావడంతో అదే తీర్చేందుకు కనుకయ్య ప్రస్తుతం హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అప్పు తీర్చేలేననే బాధతో గురువారం పురుగుల మందు తాగగా, శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్ తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్ క్రైం, జూలై 5: కూతురుకు వివాహం జరగడం లేదని మనస్తాపంతో మద్యానికి బానిసగా మారి పురుగుల మందుతాగిన గణేశ్‌నగర్‌కు చెందిన తోట వెంకటేశ్వరరావు(55) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 25న ఇంటిలో మద్యంలో పురుగుల మందు కలిపి తాగగా కుటుంబసభ్యులు వెంకటేశ్వరరావును కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

సారంగాపూర్,జూలై, 5 : మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన పీసు ప్రవళిక(36) అనే మహిళ ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతూ గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల మేరకు ప్రవళికకు అదే గ్రామానికి చెందిన పీసు తిరుపతి రెడ్డితో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే తిరుపతి రెడ్డి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నారు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసి పడుకుంది. అందరూ నిద్రో ఉన్న సమయంలో ఇంట్లోనే ఉరివేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తల్లి బద్దం మాధవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలిక ప్రసవం

● ఓ యువకుడు మోసం చేశాడని తల్లి ఫిర్యాదు

● కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

సైదాపూర్, జూలై 5: సైదాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) పెళ్లి కాకుండానే ప్రసవించి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటోంది. తల్లిదండ్రులకు వ్యవసాయ పనులకు చేదోడు వాదోడుగా ఉంటూ పనికి వెళ్తుండేది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వరుసకు బావ అయ్యే యువకుడు(17) ఆమెపై అత్యాచారానికి పాల్పడంతో బాలిక గర్భం దాల్చింది. ఈ నెల 1న వరంగల్ ఎంజీఎంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బాలిక తల్లి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

ఎండపల్లి, జూలై 5: మండలంలోని గుళ్లకోట గ్రామంలో తాటి చెట్టుపై నుంచి కింద పడడంతో గీత కార్మికుడికి గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామంలో మూల లచ్చయ్య గౌడ్ గీత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు లాగే శుక్రవారం కూడా తాటిచెట్టు ఎక్కాడు. పైకి ఎక్కాక మోకు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న గౌడ సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి సత్యం గౌడ్ చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించి జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

మహిళపై కోతుల దాడి

బీర్‌పూర్, జూలై 5: బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన మహిళపై శుక్రవారం కోతులు దాడి చేసి గాయపరిచాయి. బీర్‌పూర్ గ్రామానికి చెందిన చిర్నేని రఘునా అనే మహిళ తన ఇంటి వద్ద పనులు చేసుకుంటుండగా చెట్టుపైన ఉన్న కోతులు ఒకే సారిగా కిందకు దూకి దాడి చేసి గాయపరిచాయని బాధిత మహిళ తెలిపింది. కోతులతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఇంట్లో దూరి వంట సరుకులు చిందరవందరగా చేస్తూ ఇంటి పై కప్పులు తొలగిస్తున్నాయని వాపోయింది. అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

సిరిసిల్ల చేనేత అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

» హైదరాబాద్‌లో రూ. 100 కోట్లతో ప్రత్యేక మాల్ ఏర్పాటుకు యత్నం

» 35 మంది యువ పారిశ్రామికవేత్తలతో వెలిచాల రాజేందర్‌రావు భేటీ

» మిల్లుల ఆధునికీకరణ, ప్రింటింగ్, డైయింగ్ మిషన్‌లపై చర్చ



యువ పారిశ్రామికవేత్తలతో చర్చిస్తున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్/సిరిసిల్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడం, చేనేత రంగ అభివృద్ధి కోసం విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేశామని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే విధంగా తాను కృషి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన 35మంది చేనేత కుటుం బాలకు చెందిన యువ పారిశ్రామిక వేత్తలు శుక్రవారం వెలిచాల రాజేందర్‌రావును కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి లోతుగా చర్చించారు. వీరంతా ఇంజనీరింగ్, డిగ్రీ పూర్తి చేసిన యువ పారిశ్రామిక వేత్తలు. యువకుల ఆలోచనకు అనుగుణంగా నవతరం దృక్పథంతో నవీన పద్ధతుల్లో ముందుకు వెళ్లాలని ఆలోచనతో రాజేందర్‌రావును కలిసి వారి ఆలోచన లను తెలిపారు. వీరిలో 10 మంది 10 రోజులు తమిళనాడులో వస్త్ర పరిశ్రమలకు ప్రసి ద్ధిచెందిన తిర్పూర్, కోయంబత్తూర్, సేలం లాంటి పట్టణాలను సంద ర్శించి 10 రోజులు అక్కడే వస్త్ర పరిశ్రమ గురించి అవగాహన చేసుకున్నారు. వెలిచాల రాజేందర్‌రావు ఎన్నికల సమయంలో సిరిసిల్ల విజన్ డాక్యుమెంట్ తయారుచేసి, యువ పారిశ్రామికులతో రోడ్ మ్యాప్ కోసం వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ వచ్చే వారం సిరిసిల్లలో మరోసారి సమావేశమై దీనికి తుది రూపు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆ తరువాత హైద్రాబాద్లో టెక్స్‌టై ల్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, టెక్స్‌టైల్ కమిషనర్ అలుగు వర్షిణి, మంత్రి పొన్నం ప్రభాకర్, శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలువనున్నట్లు తెలిపారు. ఆ తరువాత వారంలో ముఖ్యమంత్రిని కలిసి సిరిసిల్ల చేనేత రంగం అభివృద్ధిపై విజన్ డాక్యుమెంట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. దీంతో పాటే తాను తయారు చేసిన సిరిసిల్ల వీవర్స్ విజన్ డాక్యుమెంటును కూడా ఎలా ముందుకు తీసుకువెళ్లాలనే విషయాన్ని సుదీర్ఘంగా చర్చిస్తున్నట్లు తెలిపారు. వస్త్రవిహార్ పేరుతో హైదరాబాద్‌లో ఒక ఆధునిక మాల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం రూ. 100 కోట్ల క్యాపిటల్‌తో ముఖ్యమంత్రితో మాట్లాడతానని రాజేందర్‌రావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు అందించి సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమకు వచ్చే స్కీములు, సబ్సిడీలు, గ్రాంట్లు ఇంట్రెస్ట్‌ఫ్రీ లోన్స్ సాధించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో గోవింద్ శ్రీకాంత్, దూడం శ్రీకాంత్, భానుచందర్, వంశీకృష్ణ, సతీప్, ప్రవీణ్, శ్రీరాం, భరత్, కోమాకుల మల్లికార్జున్, వేణుగోపాల్, దూస రమేష్, అడెపు వివేక్, గాజుల సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట రూరల్, జూలై 5: జమ్మికుంట మున్సిపల్ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌లు శుక్రవారం పట్టుకున్నారు. గండ్రపల్లి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును ధర్మారంలో తనుగుల కుఇసుక తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను కొత్తపల్లిలో అదుపులోకి తీసుకున్నారు. వాటికి ఎలాంటి అనుమతి పత్రాలు లేక పోవడంతో మల్లేష్, కుమార్, వెంకటేష్, శ్రీనివాస్, ధనూష్, అరవింద్‌లపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

వీణవంక: చల్లూరు గ్రామంలోని మానేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. డ్రైవర్ సాగర్, యజమాని ఉండాటి పోచయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మహిళకు తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూలై 5: శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో శుక్రవారం కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై కారు ఢీ కొన్న ఘటనలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తగట్టుకు చెందిన పల్లె రజిత బావి వద్దకు వెళ్లి వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి తిరి వస్తూ, తన భర్త మహేందర్‌రెడ్డి కోసం కరీంనగర్-వరంగల్ రహదారిపైన రోడ్డు పక్కకు నిలబడి ఉన్నారు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హుజూరాబాద్‌కు వెళ్లే కారు రజితను ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయాల య్యాయి. రజిత అపస్మారక స్థితిలోకి చేరింది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందిస్తూ హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

'నీట్'పై సుప్రీంకోర్టులో విచారణ జరిపించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో శుక్రవారం జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మతం ముసుగులో విచ్ఛిన్నకర శక్తులు కుట్రలు చేస్తున్నాయని వాస్తవాలను వక్రీకరించే విధంగా బీజేపీ ప్రచారం చేయడం దురదృష్టకరం అన్నారు. దేశంలో లక్షలాది మంది వైద్య విద్యార్థులకు చెందిన నీట్ పరీక్ష ప్రహసనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నీట్ పరీక్ష ఏ రాష్ట్రానికి సంబంధించి ఆ రాష్ట్రమే పరీక్ష నిర్వహణ చేసేదని, పారదర్శకత పేరుతో జాతీయస్థాయి పరీక్షగా మార్చి కేంద్రం గుత్తాధిపత్యం తీసుకుందని విమర్శించారు. నీట్ ఎంట్రెన్స్ పరీక్షను నిర్వహించలేని అసమర్థత ఎన్డీయే ప్రభుత్వానిదేనన్నారు. కేంద్రం తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు, వాస్తవాలు బయటపడతాయనే ఉద్దేశ్యంతోనే తన పరిధిలో పనిచేసే సీబీఐకి కేసును అప్పగించిందని విమర్శించారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సీబీఐతో కాకుండా సుప్రీంకోర్టులో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్రం వైఫల్యంతో విశ్వాసం సన్నగిల్లి అభద్రత భావన చోటుచేసుకుందన్నారు. పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పూర్తిగా విఫలమైందన్నారు. పరీక్ష లీకేజీపై ఆయా విద్యార్థి సంఘాలు దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిస్తే , దాని దృష్టిని మరల్చేందుకు రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై నిరసన తెలియజేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఉపాధి కల్పించేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్‌కార్యక్రమం ప్రవేశపెట్టిందని, దీంతో పాటు అవినీతి రహిత పాలన కోసం సమాచార హక్కు చట్టం, ప్రతి ఒక్కరికీ విద్యను అందించాలనే తలంపుతో విద్యాహక్కు చట్టం, నిరుపేదల కడుపు నింపేందుకు ఆహార భద్రత చట్టాన్ని అమలు చేసిందని, కానీ పదేళ్ల ఎన్డీయే పాలనలో నోట్ల రద్దు, జీఎస్టీ, నిత్యావసర ధరల పెంపు వంటి ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవాలను గమనించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర బాధ్యులు బండ శంకర్, జిల్లా బాధ్యులు గిరి నాగభూషణం, మున్సిపల్ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెపల్లి దుర్గయ్య, సీనియర్ నాయకులు రాధాకిషన్‌రావు, గుంటి జగదీశ్వర్, నెహాల్ బొల్లి శేఖర్ తదితరులున్నారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధం కావాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 5: గ్రామస్థాయిలో సీపీఐని బలోపేతం చేస్తూ స్థానిక ఎన్నికలకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయం బద్ధం ఎల్లారెడ్డి భవన్‌లో కరీంనగర్, సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సీపీఐ పార్టీ నిర్మాణం, ప్రజాసంఘాల నిర్మాణం పటిష్ఠంగా ఉండేదన్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, ఆయా జిల్లాల్లో పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసుకో వల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజా సంఘాలు నిర్మాణాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని ప్రజాసంఘాల పునర్నిర్మాణం చేసుకుని కమిటీలు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లోని ప్రజల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేసినట్లయితే స్థానిక ఎన్నికల్లో గెలుపొందే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. సీపీఐ నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో కరీంనగర్, సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, జిల్లాల సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తాండ్ర సదానందం, వెన్న సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, గోశిక మోహన్, ఆయా జిల్లాలకు చెందిన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విలేకరుల పేరిట వసూళ్లు.. ముగ్గురి రిమాండ్

వేములవాడ టౌన్, జూలై 5: విలకరుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ డివిజన్ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన సిద్దయ్యకు 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 50 ఏళ్లుగా కాలువ నీటితో సాగు చేసుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన మల్లయ్య అనే వ్యక్తి కాలువను కూడిపి వేసి కింద ఉన్న వ్యవసాయ పొలాలకు సాగు నీరు వెళ్లకుండా చేశాడు. దీంతో కరుణాకర్, నరేష్, ప్రసాద్ అనే ముగ్గురు తాము విలేకరులమని, మల్లయ్యతో మాట్లాడుతామని అందుకు రూ.50 వేలు ఇవ్వాలని సిద్దయ్యను డిమాండ్ చేశారు. దీంతో సిద్దయ్య రూ.15 వేలు అందజేశాడు. కొద్ది రోజులకు మరిన్ని డబ్బులు ఇవ్వాలని అడుగగా సదరు రైతు నిరాకరించాడు. సదరు ముగ్గురు వ్యక్తులు మల్లయ్యతో చేరి సిద్దయ్య పొలానికి వెళ్లే రోడ్డును పూర్తిగా ధ్వంసం చేయించారు. దీంతో సిద్దయ్య కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శుక్రవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 1,620 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 11.44 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.265 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.330 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

299 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

మానకొండూర్, జూలై 5: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం మానకొండూర్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి వరంగల్ నుంచి మహారాష్ట్రలోని నాందేడుకు తరలిస్తున్న 299 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని లారీలో తరలిస్తున్నారు. మండల కేంద్రంలోని పల్లెమీద బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా బియ్యం లభ్యం కావడంతో పోలీసులు వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసి వరంగల్‌కు చెందిన డ్రైవర్ జమీల్, సయ్యద్ హైమద్, క్లీనర్ కుశాల్‌రావు, తడక సతీష్, జన్ను అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

పెంపుడు జంతువులతో.. జాగ్రత్త



- వ్యాధులు సంక్రమించే ప్రమాదం
- అవగాహన కలిగి ఉండాలని నిపుణుల సూచన
- నేడు వరల్డ్ జూనోసిస్ డే

జగిత్యాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాలక్షేపం, సరదాగా పెంచుకునే జంతువుల నుంచి సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను జూనోసిస్‌గా పేర్కొంటారు. వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని నిపుణు లు చెబుతున్నారు. శనివారం వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

● రేబిస్ రాకుండా..

ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ మొదటి సారిగా 1885 జూలై 6వ తేదీన పిచ్చి కుక్క కాటుకు గురైన బాలుడికి నిరోధక టీకా ఇవ్వడం ద్వారా రేబిస్ వ్యాధి రాకుండా కాపాడగలిగాడు. దీంతో అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం జూలై 6వ తేదీన జూనోసిస్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. పెం పుడు జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు.

● 200 రకాల వ్యాధులు..

శాస్త్రవేత్తలు, వైద్యుల అంచనాల ప్రకారం జంతువుల నుంచి మనుషులకు దాదాపుగా 200 రకాల వ్యాధులు సోకుతాయి. పెంపుడు జంతు వుల వల్ల పిల్లలకు ముప్పు ఎక్కువగా ఉంటుంది. కరోనా వైరస్ గబ్బిలాల నుంచి వ్యాపించినట్లు పేర్కొన్నప్పటికీ పూర్తి స్థాయి నిర్ధారణ జరగలేదు. పందుల ద్వారా మెదడు వాపు వ్యాధి, కుక్కల ద్వారా రేబిస్, గొర్రెలు, మే కల ద్వారా అంత్రాక్స్, ఆవులు, గేదెల ద్వారా క్షయ, పాలద్వారా బ్రూసె ల్లోసిస్ తదితర వ్యాధులు వ్యాపిస్తాయని వైద్యులు అంటున్నాయి. వ్యాధు లు సోకిన కోళ్లు, గొర్రెలు, జంతువులు, పశువుల మాంసం తిన్నాకూడా మనుషులకు వ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉంది. కుక్కలు తది తరాల మలమూత్రాల వల్ల కూడా వ్యాధులు సంక్రమిస్తాయి. కుక్కలు, పిల్లులను ఒడిలో, సోఫాల్లో, మంచాల్లో కూర్చుండబెట్టినప్పుడు దుస్తుల ద్వారా బ్యాక్టీరియా, వైరస్ వ్యాపిస్తుంది. అన్ని వ్యాధుల్లోనూ రేబిస్ అత్యం త ప్రమాదకరమని వైద్యులు అంటున్నారు. పిచ్చి కుక్కలు మనుషులను, గేదెలను కరవటం పరిపాటిగా మారగా వీటిని నిర్మూలించేలా, వీధి కుక్కలకు సైతం వ్యాక్సినేషన్ చేయాల్సి ఉంటుంది.



అవగాహన అవసరం..

మూగజీవాల పెంపకంలో అవగాహనతో పాటు అప్రమత్తత ఎంతో అవసరం. మనం ఎంతో అభిమానంగా పెంచుకునే కుక్కల నుంచి ర్యాబిస్, గజ్జి, పశువుల నుంచి, గొర్రెలు, మేకల వంటి గడ్డి తినే జంతువుల నుంచి ఆంత్రాక్స్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వ్యాధుల లక్షణాలు గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించి సూచనలు తీసుకోవాలి.

- డాక్టర్ నీలారపు శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

వ్యాక్సినేషన్ చేయించాలి..



ఇంట్లో పెంచుకునే జంతువులకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలి. లేకపోతే జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్ర మించే ప్రమాదం పొంచి ఉంది. ఈ వ్యాధులు వ్యాప్తి చెం దకుండా ఉండా లంటూ రెగ్యులర్ వెటర్నరీ వైద్యుల సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు పాటించాలి.

- కందుకూరి పూర్ణచందర్, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్

● ఇవి పాటిస్తే మేలు..

వ్యాధుల బారిన పడకుండా జగ్రత్తలు పాటించాలి. కుక్కలను ఉంచే గదులు, కట్టివేసే ప్రాంతాలను సైతం శుభ్రంగా ఉంచాలి. పిల్లలు కుక్క లతో ఆడుకున్న వెంటనే స్నానం చేయించాలి పెంపుడు కుక్కలకు ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరి గా టీకాలు వేయించాలి. పశు వైద్యులు, సిబ్బందిని సంప్రదించి వివరాలను తెలుసుకొని జూనోసిస్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

నిరుద్యోగులకు న్యాయం చేయాలి



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 5 : ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ గ్రూప్2, 3 పోస్టులను పెంచాలని పోరాటాలు చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, గ్రూప్1 పోస్టులకు మెయిన్స్ రాయడం కోసం అభ్యర్థులకు అవకాశం కల్పించాలని అన్నారు. గ్రూప్ 2,3 పోస్టులనుపెంచి పరీక్షలకు సమయాన్ని పొడిగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఖాళీలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత్వ పత్రాన్ని విడుదల చేయాలన్నారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలన్నారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి నిరుద్యోగుల సమస్యలపై స్పందించాలని, లేని పక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నిశాల్, దినేష్, రాజేందర్, రాజశేఖర్, రవివర్మ, అదిత్య, అజయ్, రాజు, అబిలాష్, రాజు పాల్గొన్నారు.

బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి


సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ

- ఎస్పీ అఖిల్ మహాజన్

బోయినపల్లి, జూలై 5: పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. శుక్రవారం బోయినపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులపై జాప్యం చేయకుండా స్టడీ చేయాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ప్స్ విధులు నడుస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రాపర్‌గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. డయల్ 100కు కాల్ రాగానే వెంటనే సంఘటన స్థలానికి చేరుకోవాలని, సమస్య పరిష్కరించాలని అన్నారు. సిబ్బంది వద్ద కేటాయించిన గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం ఉండాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృషి చేయాలన్నారు. విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయన్నారు. మారుతున్న నేరాల నమూనాకు అనుగుణంగా గస్తీ, పెట్రోలింగ్ పెంచాలన్నారు. అంతకుముందు పోలీసు స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వ హణ, రిసెప్షన్, జీడీ ఎంట్రీ తదితర రికార్డులను పరిశీలించారు. సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ పృథ్వీధర్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను కలిసిన ప్రెస్‌క్లబ్ సభ్యులు


కలెక్టర్‌ను సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 5: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల విధుల్లో చేరిన సందీప్ కుమార్ ఝాతోపాటు, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అకుల జయంత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు కలెక్టర్‌ను సన్మానించారు. ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి పరకాల ప్రవీణ్, సభ్యులు అల్లె రమేష్, బాబుగౌడ్, రాపెల్లి భాస్కర్, మల్లికార్జున్, ప్రసాద్, అకునూరి శంకర్, దయానంద్, వేణు తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఇల్లంతకుంట, జూలై 5: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మిక మండలి, సీఎస్సీ హెల్త్‌కేర్‌ల ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్యాంపు కో ఆర్డినేటర్ మేరుగు శ్రీనివాస్, క్యాంపు కో ఆర్డినేటర్ బింగి మహేష్, సాయికృష్ణ, మౌనిక పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎల్లారెడ్డిపేట, జూలై 5: ఆపదలో ఉన్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవడంతోపాటు అండగా నిలుస్తామని తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో అనారోగ్యంతో బాధ పడుతున్న బీఆర్‌ఎస్ కార్యకర్త జులేఖను స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం పరామర్శించారు. వైద్యానికి రూ.5 వేల నగదు అందజేశారు. ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి తన వంతుగా రూ.2 వేలు అందించారు. కార్యకర్తలకు అందుబాటులో ఉండి ఆపద సమయంలో ఆదుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందించేలా చూస్తామని హామీ ఇచ్చారు. నాయకులు రమేశ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, సతీష్, చంద్రం తదితరులు ఉన్నారు.

మండలస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం

కోనరావుపేట, జూలై 5: కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో శుక్రవారం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ కేపీఎల్ సీజన్-2 నైట్ రైడర్స్ ప్రారంభమైంది. వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ మంతెన సంతోష్ ప్రారంభించారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మిరియాల్‌కార్ బాలాజీ ఈ జెర్సీలను అందజేశారు. తాజా మాజీ ఎంపీటీసీ యాస్మిన్ భాష కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా జెర్సీలను అందజేశారు. కోనరావుపేట తాజా మాజీ ఎంపీటీసీ చారి తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు డబుల్ బెడ్ రూం ఇళ్లు

ఎల్లారెడ్డిపేట, జూలై 5: నీడ నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అద్దె ఇళ్లుగా మారాయి. లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లను అద్దెకు ఇస్తూ నెలకు రూ.1500 తీసుకుంటున్నారు. మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో కొందరు లబ్ధిదారులు నేటికి గృహ ప్రవేశం చేయకపోవడం, వారికి కేటాయించిన ఇళ్లను అద్దెకు ఇస్తుండడంతో తమకు అన్యాయం చేశారని ఇళ్లు లేని పేదలు ఆరోపిస్తున్నారు. సుమారు పది మంది తమకు కేటాయించిన ఇళ్లను అద్దెకు ఇచ్చారని ఆరోపిస్తున్నారు. కొందరు నాయకులు డబ్బులు తీసుకుని ఇళ్లను మంజూరు చేయించారని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆ ఇళ్లను అద్దెకు ఇస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అద్దె ఇళ్లను స్వాధీనపర్చుకోవాలని, తమకు కేటాయించాలని పేదలు కోరుతున్నారు.

నూతన కార్యవర్గం

గంభీరావుపేట, జూలై 05 : గంభీరావుపేట మనుమయ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిట్టపల్లి రాజాచారీ, ఉపాధ్యక్షుడిగా చేపూరి అంజయ్యచారి, ప్రధాన కార్యదర్శిగా మిట్టపల్లి ఆంజనేయులుచారి. జాయింట్ సెక్రెటరీగా మిట్టపల్లి బాలరాజుచారి, కోశాధికారిగా మిట్టపల్లి శ్రీనివాస్‌చారి ఎన్నికయ్యారు. సంఘం గౌరవ సలహాదారులు జోగయ్యగారి లక్ష్మీనారాయణచారి, ముత్తయ్యగారి బాలకృష్ణయ్యచారి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు.

ఎల్లమ్మతల్లి ఆలయంలో చోరీ

ఇల్లంతకుంట, జూలై 5: మండల కేంద్రంలోని ఎల్లమ్మతల్లి ఆలయంలో చోరి జరిగింది. గౌడ సంఘం నాయకుల వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం వెళ్లి చూసేసరికి ఆలయ ప్రధాన ద్వారానికి వేసిన తాళం పగలగొట్టి ఉంది. ఆలయంలో అమ్మవారి పుస్తెలు, వెండి కళ్లతోపాటు హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. గౌడ సంఘం నాయకుల ఫిర్యాదుతో ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, క్లూస్‌టీం సభ్యులు ఆలయాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాజా మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం


కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగం కుమార్

చందుర్తి, జూలై 5: పదవీ కాలం ముగిసిన సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు, ఆర్‌ఎంపీలు చందుర్తిలో శుక్రవారం జడ్పీటీసీ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన తాజా మాజీ జడ్పీటీసీ నాగం కుమార్ మాట్లాడుతూ ప్రజా జీవితంలో ఉన్నంతకాలం మండల ప్రజలను మర్చిపోనన్నారు. ఐదేళ్లలో తనకు సహకరించిన ప్రజలకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు పులి సత్తయ్య, వేల్పుల దేవస్థానం, ధర్మపురి శ్రీనివాస్, గోట్టే ప్రభాకర్, బాణాల రవీందర్ రెడ్డి, ముక్కు పద్మ మల్లారెడ్డి, బొజ్జ మల్లేశం, దూది శ్రీనివాసరెడ్డి, మధు ఏసుదాసు, ఆర్‌ఎంపీ వైద్యులు రాజలింగం, బాబు, సాగర్, శ్రీనివాస్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఐదేళ్లపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఎల్లారెడ్డిపేట, బండలింగంపల్లి తాజా మాజీ ఎంపీటీసీలు నాగరాణి-పర్శరాములు, పద్మ-దేవయ్య దంపతులను స్థానిక నాయకులు శుక్రవారం సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గౌస్, లింగాగౌడ్, కృష్ణ, బాబు, బాల్‌రెడ్డి, రాజుకుమార్, రాజయ్య, లచ్చిరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, కార్తీక్, శ్రీనివాస్‌గౌడ్, రాజిరెడ్డి, ప్రదీప్‌గౌడ్, బుచ్చాగౌడ్, అంజాగౌడ్, సంతోష్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం బావుసాయిపేట, గోవిందరావుపేట తండా గ్రామాల తాజా మాజీ ఎంపీటీసీ యాస్మిన్ భాషను కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పదవి లేకున్నా ప్రజల వెంట ఉండి ప్రజల కోసం పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు ఫిరోజ్ పాషా, నందు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం నాయకుల ముందస్తు అరెస్టు

ఇల్లంతకుంట, జూలై 5: మండలంలోని విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. గ్రూప్స్ పోస్టులు పెంచాలని టీజీ పీఎస్సీ ముట్టడికి పిలుపునివ్వగా మండలం నుంచి తరలి వెళ్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా అరెస్టు చేసినా పోరాటాన్ని ఆపబోమన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న ఉద్యోగాల ఖాళీలపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనీల్‌కుమార్, ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు అక్కెం నాగరాజు తదితరులు ఉన్నారు.

ఏబీవీపీ నాయకుడి..

ఎల్లారెడ్డిపేట, జూలై 5: టీజీఎస్‌పీఎస్‌సీ ముట్టడి నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట పోలీసులు అప్రమత్తమయ్యారు. మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ మారవేణి రంజిత్‌కుమార్‌ను శుక్రవారం వేకువజామున ముందస్తు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగల జీవితాలతో ఆటలాడుతోందని మారవేణి రంజిత్ కుమార్ ఆరోపించారు. నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. నిర్బంధంతో ఉద్యమాలను అణచివేయలేరన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ ప్రకటన విడుదల చేయాలని, నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

చందుర్తి, జూలై 5 : మండలంలో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని తాజా మాజీ జడ్పీటీసీ కుమార్ అన్నారు. చందుర్తి మండలం లింగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులు, ప్రధాన ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో రెండు అదనపు తరగతికి గదులు కావాలని కోరగా, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి గదుల నిర్మాణానికి నిధుల మంజూరు కోసం కృషి చేస్తానన్నారు. ఆయన వెంట నాయకులు బండారి శేఖర్, తదితరులు ఉన్నారు.

అదుపుతప్పి వ్యాన్ బోల్తా

వేములవాడ టౌన్, జూలై 5 : అదుపుతప్పి డీసీఎం మినీ వ్యాన్ బోల్తా పడిన సంఘటన వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డీసీఎం మినీ వ్యాన్ కామారెడ్డి నుంచి వరంగల్ వెళ్తోంది. అదుపుతప్పి మర్రి చెట్టును ఢీకొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ముస్తాబాద్, జూలై 5: మండలంలోని బందనకల్ గ్రామ శివారులో పేకాట రాయుళ్లను పోలీసులు పట్టుకున్నారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు, కేసు నమోదు చేసినట్లు సీఐ మొగిలి తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

వేములవాడ రూరల్, జూలై 5: స్కూల్ బస్సు ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని హన్మాజీపేట గ్రామానికి చెందిన కొమ్ము రాజయ్య, లచ్చిరెడ్డి ఎనుగంటి గ్రామం నుంచి హన్మాజీపేట వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఎదురుగా వచ్చిన స్కూల్ బస్సు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను హుటాహుటిన ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ మారుతి తెలిపారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

రుద్రంగి, జూలై 5: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన రుద్రంగి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బోదాసు లావణ్య (33) ఈ నెల 3న రాత్రి 9 గంటలకు ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. బోదాసు లావణ్య కుటుంబ సభ్యులు తమ బంధువుల ఇళ్ల వెతికినా సమాచారం లభించలేదు. దీంతో మహిళ తండ్రి గొల్ల ఎర్ర నర్సయ్య ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు, విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. బోదాసు లావణ్య ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

చినుకు పడితే చిత్తడే..


అధ్వానంగా నాగంపేట, పొన్నాలపల్లె రోడ్డు

గంభీరావుపేట, జూలై 4: గంభీరావుపేట మండలం నాంగపేట, పొన్నాలపల్లె రోడ్డు అధ్వానంగా మారింది. రెండు గ్రామాల మధ్య ఉన్న మట్టి రోడ్డు చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారుతోంది. గుంతల్లో వర్షపు నీటితో రోడ్డు బురదమయమవుతోంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అసలే మట్టి ఆపై వర్షాలు పడితే ఈ మార్గం గుండా వాహనాలు వెళ్లాలంటే కష్టమవుతుంది. అధికారులు పట్టించుకోవాలని, బీటీరోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సారా విక్రయిస్తే చర్యలు

ఎల్లారెడ్డిపేట, జూలై 5: సారా తయారీ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఎక్సైజ్ నిబంధనలను ఉల్లంఘించి సారాను అమ్ముతున్న మండలంలోని నారాయణపూర్‌కు చెందిన పోచవ్వను తహసీల్ అధికారుల ఎదుట శుక్రవారం హాజరు పరిచారు. డీటీ సత్యనారాయణ రూ.50 వేల జరిమానా విధించారు. జరిమానాను చెల్లించిన పత్రాన్ని సీఐ శ్రీనివాస్‌కు అందజేసింది. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలపై నిత్యం దాడులు నిర్వహిస్తామన్నారు. సారా తయారీ, అమ్మకాలపై 8712658830 నంబర్‌కు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. సారా రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

యువకుడి అరెస్టు

ఇల్లంతకుంట, జూలై 5: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన మండల కేంద్రానికి చెందిన కుంటాల శేఖర్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఈ నెల 4న పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా శేఖర్ మద్యం మత్తులో వాహనం నడుపుతూ వచ్చాడు. పోలీస్ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడు. దీంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

క్లిక్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ కార్యవర్గం

కోనరావుపేట, జూలై 5 : కోనరావుపేట మండల క్లిక్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకటి అశోక్, ఉపాధ్యక్షుడిగా తొట్ల వినోద్, ప్రధాన కార్యదర్శిగా అదిరి మోహన్ ఎన్నికయ్యారు.

రెడ్డి సంఘం కార్యవర్గానికి సన్మానం

ఇల్లంతకుంట, జూలై 5: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామరెడ్డి సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం నాయకులు ఘనంగా సన్మానించారు. రెడ్డిసంఘం ఎన్నికలు ఇటీవల జరుగగా నూతన కార్యవర్గం ఏర్పడింది. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, రెడ్డిసంఘ అధ్యక్షుడు కేతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాయకులు కేతిరెడ్డి రవీందర్‌రెడ్డి, రమణారెడ్డి, నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీ ఎదుట వినియోగదారుల ధర్నా


ధర్నా చేస్తున్న వినియోగదారులు

ముస్తాబాద్, జూలై 5: ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఓ గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని కార్యాలయం ఎదుట పోత్గల్ గ్రామ యువకులు కోట ధర్మేందర్, కోల కృష్ణ ఆధ్వర్యంలో వినియోగదారులు శుక్రవారం ధర్నా చేశారు. గ్యాస్ ఏజెన్సీ నుంచి వచ్చామంటూ వినియోగదారుల నుంచి రూ.200కు పైగా డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. రూ.200 చెల్లిస్తే సబ్సిడీ సిలిండర్, ఇతర సౌకర్యాలు వర్తిస్తాయంటూ దాదాపు మండలంలో 6 వేల మందికి పైగా గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో వసూలు చేశారని ఆరోపించారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి జితేందర్‌రెడ్డికి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులకు సైతం ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కొంతకాలంగా వినియోగదారుల నుంచి డోర్ డెలివరీ చేస్తే అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోత్గల్ గ్రామస్థులు భూమరాజం, కిషన్, చీకోటి మహేష్, మహిళలు, యువకులు, వినియోగదారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్ సర్కార్


మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ టౌన్, జూలై 5 : ప్రజల ఆగ్రహానికి గురై పత్తలేకుండా పోయిన బీఆర్‌ఎస్ తీరునే కాంగ్రెస్ సర్కార్ అవలంబిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. టీజీపీఎస్సీ ముట్టడి నేపథ్యంలో నిరుద్యోగ జేఏసీ పిలుపుతో జిల్లా వ్యాప్తంగా 23 మంది బీజేవైఎం నాయకులను ముందస్తు అరెస్టులు చేయడంపై శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వేచ్ఛగా నిరసన తెలిపే హక్కు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యార్థుల నిరసనను అడ్డుకుందని, దానికి ఫలితం అనుభవించిందని అన్నారు. అరెస్టులు మానుకోవాలని, లేకుంటే బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. నిరుద్యోగులకు, విద్యార్థులకు బీజేపీ అండగా నిలుస్తుందన్నారు. ఎన్నికల ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అములు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

భోజనంలో మెనూ పాటించడం లేదు


పాఠశాల ప్రత్యేక అధికారితో మాట్లాడుతున్న నాయకులు

గంభీరావుపేట, జూలై 5 : మెనూ ప్రకారం బోజనం పెట్టడం లేదని గంభీరావుపేట కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు గోడు వెల్లబోసుకున్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో వంట రుచిగా వండడం లేదంటూ విద్యార్థినులు శుక్రవారం విలేకరులు, నాయకులకు తెలిపారు. పాఠశాలలో విద్యార్థినులు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని సమాచారం అందుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ హమీద్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, పాత్రికేయులు అక్కడికి వెళ్లారు. ఉదయం, సాయంత్రం మెనూ పాటించడం లేదని విద్యార్థినులు తెలిపారు. వాచ్‌మెన్ తమతో పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల నిర్వహణ లోపాలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, విద్యార్థినులకు సమస్యలు లేకుండా చూస్తామని హమీద్ వెల్లడించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

వీర్నపల్లి, జూలై 5 : మద్యం తాగి వాహనాలను నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. వీర్నపల్లి మండలంలోని సరిహద్దు శివారులో శుక్రవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్ లేని వాహనాలకు జరిమానాలతో పాటు చర్యలు తప్పవన్నారు. ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం అక్రమ ంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, లక్ష్మణ్, సిబ్బంది యాకూబ్, రియాజ్, మల్లాగౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

నేతన్నలకు ఉపాధి కల్పించాలి

- నేతన్న విగ్రహంపై కార్మికుడి నిరసన


నిరసన తెలుపుతున్న కార్మికుడు ప్రభాకర్

సిరిసిల్ల రూరల్, జూలై 5: రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు వస్త్రాల తయారీ ఆర్డర్‌లను ఇవ్వాలని మరమగ్గాల కార్మికుడు పాము ప్రభాకర్ డిమాండ్ చేశాడు. వరంగల్ జిల్లాకు చెందిన ప్రభాకర్ 25 సంవత్సరాల క్రితం సిరిసిల్లకు వలస వచ్చి మరమగ్గాల పరిశ్రమల్లో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలో నేతన్న విగ్రహం మగ్గంపై కూర్చొని నిరసన తెలిపాడు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, దీంతో 7 నెలల నుంచి కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను పోషించుకోవడం ఇబ్బందిగా మారిందని, గత ప్రభుత్వం తయారు చేయించిన బతుకమ్మ చీరల ఆర్డర్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడంతో కార్మికులకు ఉపాధి కరువై పోయిందని అన్నాడు. దీంతో మరమగ్గాలు బంద్‌వడంతో కార్మికులకు ఉపాధి దొరకడం లేదని ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశాడు. కార్మికులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించి, ఆత్మహత్యల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశాడు. సిరిసిల్లలో గడిచిన ఏడు నెలల నుంచి కార్మికులకు ఉపాధిలేదని, ఇప్పటి వరకు తొమ్మిది మంది కార్మికులు ఉపాధిలేక ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ సబ్సిడీ సైతం బంద్ చేయడం, వస్త్రాల ఉత్పత్తి ఆర్డర్‌లను ప్రభుత్వం రద్దు చేయడంతో సిరిసిల్లలో నేతన్నలకు ఉపాధి లేకుండా పోయిందన్నాడు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికులకు ఉపాధిని కల్పించి ఆదుకోవాలని కోరాడు. ప్రభాకర్ నేతన్న విగ్రహంపై ఆందోళన చేస్తున్న విషయాన్ని ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఉపాధి కల్పించే విధంగా చూస్తామని చెప్పి కిందకు దించి ఇంటికి పంపించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ నిరంకుశ పాలన


సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులు


గంభీరావుపేటలో విద్యార్థి సంఘాల నేతలు

సిరిసిల్ల టౌన్, జూలై 5: రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిరకుంశ పాలన సాగిస్తోందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ అన్నారు. జాబ్ క్యాలెండర్ విడదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కమిటీ నిరుద్యోగ మార్చ్, టీజీపీఎస్సీ ముట్టడికి పిలుపునివ్వగా శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్, రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్‌తోపాటు మరో ఎనిమిది మంది నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి మధ్యాహ్నం వదిలేశారు. అక్రమ అరెస్టుపై నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తున్న తమను అర్ధరాత్రి పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల మీద నిర్బంధం విధిస్తోందని ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగుల ఆగ్రహ జ్వాలలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎక్కువ రోజులు మనుగడ సాగించలేదని పోలీసులను అడ్డుపెట్టుకొని ఉద్యమాలను ఆపాలని చూస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని అన్నారు. ప్రజలే తగిన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెపుతారని అన్నారు. బీఆర్‌ఎస్వీ నాయకులు షేక్ బాబా, మెట్టిల సాయి, దీపక్, వల్లబోజు రమణ, కనుకంట్ల వెంకట రమణ, ఒగ్గు అరవింద్ ఉన్నారు.

గంభీరావుపేట: విద్యార్థి సంఘాల నేతల అరెస్ట్ అప్రజాస్వామికమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి కళ్యాణ్‌కుమార్ ఆరోపించారు. విద్యార్థి సంఘాల నేతలను, విద్యార్థులను గంభీరావుపేట పోలీస్‌లు అదుపులోకి తీసుకోవడాన్ని తప్పుపట్టారు. టీజీపీఎస్సీ ముట్టడికి పిలుపు ఇస్తే రాత్రికి రాత్రికే ప్రభుత్వం అరెస్ట్‌లకు శ్రీకారం చుట్టిందన్నారు. విద్యార్థి సంఘాల నాయకులను ఎక్కడికక్కడే పోలీస్‌లు అదుపులోకి తీసుకోవడం అన్యాయమన్నారు.